టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మరియు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి తరగతులు ప్రారంభం కాగా.. 30 రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండి ఆసక్తి కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు ఈదమ్మ, భూలక్ష్మమ్మ ఆలయం వద్ద అన్నదానం


కొలువుదీరిన అమ్మవార్లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలోని ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో ఈనెల 24వ తేదీన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యాన్ని ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమంలో వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమావాస్య రోజున మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఆషాఢ గోరింటాకు ఉత్సవాలు


గోరింటాకు ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

మణికొండ: ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవటం, కొత్త గాజులు వేసుకోవటం ఆనవాయితీగా వస్తోందని మాంగళ్యం ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ బత్తిని కీర్తిలతాగౌడ్ అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు పెట్టికుని, కొత్త గాజులు వేసుకున్నారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, మహిళలు పాల్గొన్నారు.

ఉమ్మడి దేవాలయాల నూతన కమిటీ


నూతన కమిటీ అధ్యక్షుడు శంకర్‌ను సన్మానిస్తున్న కోర్ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ఉమ్మడి దేవాలయ కోర్ కమిటీ సభ్యులు మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సెంట్రింగ్ శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా కింగిరి శేఖర్, కోశాధికారిగా జేసీప్రకాష్‌ని కోర్ కమిటీ సభ్యులు ఎస్.వెంకటేష్, మాజీ కౌన్సిలర్ సోమ శ్రీనివాస్‌గుప్తా, బెల్లంపల్లి వెంకటేష్, పోతరాజు మల్లేష్, ఎల్.కిష్టప్ప, లక్ష్మణ్ పటక్ మల్లేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న కోర్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు చోటివ్వమని స్పష్టం చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, బి.కుమారస్వామి, అంజి, రాజ్‌కుమార్, రవి, వెంకటరమణగుప్తా, కిషోర్, బాల్‌రాజ్, ఓంప్రకాష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి.. ఇబ్బందులు తొలగించండి



శంషాబాద్ రూరల్: రహదారిపై బీటీ పనులను పూర్తి చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటి పరిధిలోని పెద్ద గోల్కొండ నుంచి గొల్లపల్లి మీదుగా బెంగళూరు జాతీయ రహదారి చేరుకునే రోడ్డుపై ఇటీవల బీటీ వేశారు. రెండుకి ఇరు వైపులా బీటీ వేసి మధ్యలో వదలేశారు. దీంతో రహదారి ఎగుడు దిగుడుగా మారింది. ఇది గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై బీటీ పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు.

చావు రస్తా.!

ప్రమాదాలకు నిలయంగా దుర్గానగర్ చౌరస్తా

- ఓ పక్క సిగ్నల్ లేని వైనం.. మరోవైపు వేగంగా దూసుకొస్తున్న వాహనాలు
- రోడ్డు దాటాలంటే జంకుతున్న పాదచారులు
- తరచూ ప్రమాదాలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న అమాయకులు


సిగ్నల్ వద్ద రోడ్డు దాటడానికి యువకుల పాట్లు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్ చౌరస్తాలో రోడ్డు దాటుతూ నిత్య ప్రమాదాలతో పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎటు నుంచి ఏ వాహనం ఢీకొడుతుందోననే భయం వారిలో నెలకొంది.సిగ్నల్ ఉన్నప్పటికీ ప్రమాదాలు తప్పడం లేదు. వాహనాల రద్దీ పెరగడంతో సిగ్నళ్లు పడిన కూడా వాహనాలు ఆగడం లేదు. జీబ్రాలైన్ ఉన్నప్పటికి వాహనాల వేగాన్ని నియంత్రించలేకపోతున్నారు.

◆ కొన్ని నెలలుగా దుర్గానగర్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటి వరకు అనేక వాహనాలకు ఎంతో మంది పాదచారులు గాయాలతో బలయ్యారు. సిగ్నల్ దగ్గర ట్రాఫిక్ పోలీసులు అప్పడప్పుడు దర్శనమిస్తారు. ప్రతి రోజు సిగ్నల్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఉంటే పాదచారులు ఏ భయం లేకుండా రోడ్డు దాటడానికి అవకాశం ఉంటుందని పాదచారులు పేర్కొంటున్నారు. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడే విధుల్లో ఉంటున్నారని చెబుతున్నారు. పోలీసులు లేని సమయంలో వాహనాదారులు సిగ్నళ్లను పట్టించుకోకుండా దూసుకురావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు.ప్రతి రోజు పోలీసులు చౌరస్తాలో తప్పని సరి ఉంటేనే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయంలో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఇటీవల రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్..

◆ వారం రోజుల క్రితం ఓ వ్యక్తి చౌరస్తా నుంచి ఇటువైపు దాటే సమయంలో ఓ యువకుడు వేగంగా బైకుతో ఆ వ్యక్తిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన సదరు వ్యక్తి అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దుర్గానగర్ కాటేదాన్ వెళ్లేమార్గం నుంచి చంద్రాయణగుట్ట వెళ్లే బస్ స్టాపులోకి విద్యార్థినులు, మహిళలు, వృద్ధులు రోడ్డును దాటి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి



చంద్రాయణగుట్ట నుంచి కాటేదాన్, ఆరాంఘర్ వైపు వెళ్లడానికి సిగ్నళ్లు ఉన్నాయి. కానీ ఆరాంఘర్ నుంచి చంద్రాయణగుట్టకు వెళ్లడానికి దుర్గానగర్‌లో సిగ్నళ్లు లేవు. దీంతో ఆరాంఘర్ నుంచి వేళ్లే వాహనాదారులు అతి వేగంతో వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటాలంటే భయంగా ఉంటుంది. మరో ప్రత్యామ్నాయం లేక ధైర్యం చేసి రోడ్డు దాటే సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నేను కళ్లారా చూశాను. ఇప్పటికైనా అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేదా మరో సిగ్నల్ ఏర్పాటు చేయాలి. – ఉదయ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రోడ్డు దాటాలంటేనే భయం



మా ఇల్లు ప్రగతి కాలనీలో ఉంది. ప్రతి రోజు కాలేజీకి వెళ్లి దుర్గానగర్ చౌరస్తాలో బస్సు దిగి రోడ్డు దాటాలంటే భయమేస్తుంది. ఓ పక్క సిగ్నల్ ఉంటుంది మరో పక్క సిగ్నల్ ఉండదు. దీంతో ఓ వైపు వాహనాలు ఆగకుండా వేగంగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు దాటాలంటే వణుకు పుడుతుంది. ఎక్కువ మంది వచ్చిన తర్వాత గుంపుగా రోడ్డు దాటాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు దయచేసి మరో సిగ్నల్ ఏర్పాటు చేయాలి. అప్పుడే ధైర్యంతో రోడ్డు దాటగలం. – మహాలక్ష్మి, ప్రగతికాలనీ స్టూడెంట్

ఇక్కడ సిగ్నల్స్ లేవు...



◆ ఆరాంఘర్ నుంచి చంద్రాయణగుట్టకు వెళ్లే ప్రధాన రహదారిపై సిగ్నల్ లేదు. అక్కడి సిగ్నల్స్ కాటేదాన్ వైపు, ఆరాంఘర్ వైపు వెళ్లడానికి మాత్రమే సిగ్నల్స్ ఉన్నాయి. మరి ఆరాంఘర్ నుంచి చంద్రాయణగుట్ట వైపు వెళ్లే వాహనాలకు సిగ్నల్ లేవు. దీంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

◆ వాహనాలు సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో రోడ్డు దాటడానికి పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దాటే వరకు ప్రమాదం ఎటు నుంచి ముంచుకొస్తుందోనే భయం వారిలో ఉంటోంది. ఆరాంఘర్ నుంచి చంద్రాయణగుట్టకు వెళ్లే రహదారిపై పాదచారులు దాటడానికి సిగ్నల్ ఏర్పాటు చేయాలని పాదచారులు కోరుతున్నారు.



చెత్తను ఆటోరిక్షా కార్మికులకు అందించాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేషన్‌లోని 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్‌ఖాన్‌లో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, జి.వెంకట్‌రెడ్డి, కిష్టయ్య, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయండి

- శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల ప్రజల వేడుకోలు
- అటుగా వెళ్లే యువతులు, మహిళలకు వేధింపులు

శాస్త్రిపురం: ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల ప్రజలు కోరుతున్నారు. పోలీసులు బస్తీలలో పెట్రోలింగ్‌ను ఎక్కువ సమయం నిర్వహించాలని పలు బస్తీల ప్రజలు అడుగుతున్నారు. డివిజన్ల పరిధిలో ముఖ్యంగా చింతల్‌మెట్, హసన్‌నగర్, శాస్త్రిపురం, మిరాలం చెరువు ప్రాంతాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకతాయిలు తిష్టవేసి వచ్చిపోయేవారిని నానా రకాలుగా వేధిస్తున్నారని చెబుతున్నారు. ప్రధానంగా సెట్విన్‌కాలనీ, మీరాలం చెరువు వద్దకు పోలీసులు రాకపోవడంతో ఈ మధ్యకాలంలో ఆకతాయిల వేధింపులు ఎక్కువగా అయ్యాయని పేర్కొంటున్నారు. దీంతో కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లే మహిళలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. గతంలో అనేక సార్లు ఆకతాయిల కారణంగా గొడవలు జరిగిన ఘటనలూ ఉన్నాయి. పోలీసులు గస్తీ పెంచడంతో కనిపించని ఆకతాయిలు ఈ మధ్య మళ్లీ వేధిస్తున్నారని హసన్‌నగర్ కాలనీల మహిళలు చెబుతున్నారు. వారికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటమే కాకుండా దాడులకు పాల్పడుతున్నారని స్థానికుడు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకొని ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పార్కును పట్టించుకోండి.!




అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన పార్కు అధ్వానంగా మారింది. జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో కాంపౌండ్ వాల్ బేస్మెంట్ శిథిలావస్థకు చేరుతోంది. పార్కు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతాన్ని డంపింగ్ కేంద్రంగా మార్చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

యువత తీన్మార్ స్టెప్పులు.. తొట్టెల ఊరేగింపులు


రాజేంద్రనగర్ పోచమ్మ బస్తీలో తొట్టెల ఊరేగింపు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో తొట్టెల ఊరేగింపు ఘనంగా జరిగింది. బాబుల్‌రెడ్డినగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయ వెండి తొట్టెల, సాయిబాబా నగర్, మధుబన్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో అమ్మవారి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, రమేష్‌రెడ్డి, సంతుగౌడ్, నర్సింహారెడ్డి, తలారి చిన్న, భూషణ్, శివ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ పోచమ్మ బస్తీలో...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోచమ్మ బస్తీలో తొట్టెల ఊరేగింపును క్రాంతికుమార్ కుటుంబీకులతో పాటు ఎన్‌కేకే గ్రూపు సభ్యులు నిర్వహించారు. ఈ ఊరేగింపులో యువతీ, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శివరాంపల్లి వీకర్‌సెక్షన్‌లో ఘటం ఊరేగింపు

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగని సురేష్ ఆధ్వర్యంలో శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో మంగళవారం ఘటాన్ని ఊరేగించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ తొట్టెల ఊరేగింపులో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

కనెక్టివిటీ రోడ్ల పనులు పూర్తి చేయించండి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

మణికొండ: కనెక్టివిటీ రోడ్ల పనులు పెండింగ్‌లో ఉండటంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు తెలిపారు. షేక్‌పేట నుంచి ఔటర్ సర్వీసు రోడ్డు వరకు వేయాల్సిన రేడియల్ రోడ్డు–5 పనులు మధ్యలోనే నిలిచిపోవటంతో కనెక్టివిటీ లేకుండా పోయిందన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్ నుంచి బీఆర్‌సీ వద్ద రేడియల్ రోడ్డుకు కలవాల్సిన కనెక్టివిటీ రోడ్డు పనులు ఆగిపోయాయని తెలిపారు. ఈ రెండు రోడ్ల పనులను పూర్తి చేయిస్తే ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. హెచ్ఎండీఏ, హెచ్‌డీఆర్‌సీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే ఆయా శాఖల అధికారులతో వచ్చి ఆగిన పనులను పరిశీలిస్తామన్నారు. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ మాజీ కౌన్సిలర్లు పురుషోత్తం, లక్ష్మీనారాయణ, నాయకులు బి.ముత్యాలు, మల్లేష్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

అధికారులను కలిసిన మున్సిపాలిటీ కాంగ్రెస్ నేతలు

అనంతరం నాయకులు మున్సిపాలిటీ డీఈ శివసాయిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా 5,6,7,8,9,18 వార్డులలో ఉన్న పెండింగ్ పనులపై చర్చించారు. అదేవిధంగా జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్పోర్ట్స్ పార్కులో ఉన్న రిజర్వాయర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

మున్సిపాలిటీల్లో ఆక్రమణలను అడ్డుకోరా..?


పార్కు శిలాఫలకాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీకి చెందిన విలువైన పార్కుల స్థలాలు, రోడ్లు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం అన్నారు. మంగళవారం సమస్యలు తెలుసుకునే క్రమంలో పార్టీ నాయకులతో కలిసి మారుతీనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలో 1100 గజాల పార్కు లేఅవుట్‌లో ఉండగా దానిని 600 గజాలకు కుదించినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోలేదన్నారు. రోడ్ నం.2, 3లలో రోడ్డు స్థలాన్ని అక్రమించి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాలనీలో ఆక్రమణలతో పాటు దోమలు, వీధి కుక్కల సమస్య ఉందన్నారు. వాటిని అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో ఆక్రమణలపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, అధికార ప్రతినిధి ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించకపోతే చలాన్ విధిస్తాం

ఎస్ఎఫ్ఏ, సూపర్‌వైజర్లకు డీసీ హెచ్చరిక


జవాన్లు, ఎస్ఎఫ్ఏలతో సమావేశమైన డిప్యూటీ కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: తమకు కేటాయించిన ప్రాంతాల్లో చెత్తాచెదారాలను పూర్తిస్థాయిలో తొలగించకపోతే ఎస్ఎఫ్ఏలతో పాటు సూపర్‌వైజర్ల (జవాన్లు)కు చలాన్ విధిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ డా. రవికుమార్ హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం జవాన్లు, ఎస్ఎఫ్ఏలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి ఆలసత్వం ప్రదర్శించొద్దని పేర్కొన్నారు. అంటు వ్యాధులతో పాటు దోమలు వృద్ధి చెందే సమయం ఇదేనని.. పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో సిబ్బందితో ఎస్ఎఫ్ఏలు, జవాన్లు పూర్తిస్థాయిలో పనులను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతిరోజు తాను స్వయంగా క్షేత్రస్థాయి పర్యటన, ఆకస్మిక పర్యటనలు చేయనున్నట్లు తెలిపారు.

◆ ఏ ప్రాంతంలోనైనా చెత్తను తొలగించకపోయినా... పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టకపోయినా... పెనాల్టీలను విధిస్తామన్నారు. వ్యాపార సముదాయాలు, దుకాణాలు, రోడ్లపై ఉన్న టీకొట్టు వారికి తప్పనిసరిగా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే వారందరితో సమావేశాలు నిర్వహించి డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించామన్నారు. ఎవరైన రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు విధించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

గెలుపే ధ్యేయంగా నూతన కమిటీలు పనిచేయాలి

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల బీజేపీ కమిటీల నియామకం


కమిటీల వివరాలను వెల్లడిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల బీజేపీ పూర్తిస్థాయి కార్యవర్గ కమిటీలను ప్రకటించింది. గతంలో మణికొండ మున్సిపాలిటీకి బి. రవికాంత్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీకి జి.నగేష్‌యాదవ్‌లను అధ్యక్షులుగా నియమించింది. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న పూర్తి స్థాయి కమిటీలను మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా నూతన కమిటీలు పనిచేయాలన్నారు. పార్టీని మరింత పటిష్టం చేయటంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బి.మహాలింగంగౌడ్, నార్సింగి మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతియాదవ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.నగేష్ యాదవ్ పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ కార్యవర్గం..

మణికొండ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులుగా వి. వెంకటచారి, వి. మధు, డి. రాజేశ్, సి. సంగీత, ప్రధాన కార్యదర్శులుగా జి.వినోద్, కె. శివరాంరెడ్డి, కార్యదర్శులుగా కె. తరుణ్, శ్రవంతి, వై. సరస్వతి, ఆనంద్‌రావు, కోశాధికారిగా వై. యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా సీమరాణి, జ్యోతి, జ్ఞానేశ్వర్, బి. భీంరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బి. బాలకృష్ణ, జి.భద్రినాథ్, ఎం.గౌరి, ఎం. మధుబాబులను నియమించారు.

నార్సింగి మున్సిపాలిటీ కార్యవర్గం..

బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ ఉపాధ్యక్షులుగా బి. కిరణ్‌కుమార్, ఎస్. శేఖరప్ప, డి. శ్రీనివాస్, డి. మంగ, ప్రధాన కార్యదర్శులుగా ఎం. అనిల్ కుమార్, వి. బ్రహ్మచారి, కార్యదర్శులుగా జి.సాయికిరణ్, ఎస్. రాజేందర్, కె. చెన్నయ్య, ఎం. సునీత, కోశాధికారిగా జి.రవియాదవ్‌లను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా డి. భాస్కర్, ఎస్. మల్లేష్, డి. కృష్ణ, మల్లేష్‌యాదవ్, వి. రాజ్‌కిరణ్, రాజేశ్వర్, యాదయ్య, టి. నరేష్, ఐలమ్మలను నియమించారు.